క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టుకు చెందిన వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిశారు. 2024 సంవత్సర క్యాలెండర్, డైరీని ఆయనతో ఆవిష్కరింపజేశారు. అనంతరం యూనియన్ నాయకులు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిసి క్యాలెండర్లు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రీజినల్ అధ్యక్షుడు సీహెచ్ నాగేశ్వరావు, కార్యదర్శి నడవడి రమేష్, సంయుక్త కార్యదర్శి నడవడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం



పొదలకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం.మహేష్, సిబ్బంది విద్యార్థులకు దంతపరీక్షలు నిర్వహించి దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌డీ నాహిద్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ



పొదలకూరు : ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పొదలకూరు తాలూకా యూనిట్ క్యాలెండర్‌ను మంగళవారం పొదలకూరులో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.పెంచలరావు, ఎన్.వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సోమశిల డీఈ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసి ఎన్జీఓల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, ఎస్.చిరంజీవులు, కోశాధికారి కామాక్షమ్మ, సహాధ్యక్షుడు రఘురామయ్య, ఉపాధ్యక్షులు షానవాజ్, అనూరాధ, కార్యవర్గం పాల్గొన్నారు.

గ్రామసభల్లో 39 వినతులు



వినతులను పరిశీలిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరు, పున్నూరు గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకానికి సంబంధించి మంగళవారం జరిగిన గ్రామసభల్లో రీసర్వే సమస్యల పరిష్కారం కోసం 39 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. పున్నూరులో 14 అర్జీలు రాగా, లేబూరులో 25 వినతులు అందాయని తెలిపారు. సమస్యలను త్వరతగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ (సర్వే) రవికుమార్, మండల సర్వేయర్ హరనాథ్, ఆర్ఐ జీవన్‌కుమార్, వీర్వోలు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలు



విజయదీపిక పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

పొదలకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ నగేష్‌కుమారి చేతులమీదుగా ప్రభుత్వం అందజేస్తున్న విజయదీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆల్ ఇన్ వన్‌గా ఉన్న పుస్తకాన్ని చదివి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శోభానాద్రి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి



పొదలకూరు : విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని బిరదవోలు సచివాలయంలో మంగళవారం సెక్రటరీ బాలకృష్ణయ్య ఆధ్వర్యంలో సంతాకాలు సేకరించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బడుగు వెంకటరమణమ్మ, బడుగు శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం.. పార్టీలకు అతీతం

- సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి
- సమస్యల పరిష్కారానికి పడుగుపాడు పంచాయతీలో హెల్ప్‌లైన్ ఏర్పాటు



హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పడుగుపాడు పంచాయతీకి సంబంధించి మంగళవారం చంద్రమౌళినగర్ గిరిజనకాలనీలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాల సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ నంబర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడుగుపాడు పంచాయతీకి సంబంధించి సమస్యల పరిష్కారానికి పాలకవర్గం, నాయకులు ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ హెల్ప్‌లైన్ నంబర్ 9117499117ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతకుముందు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిధులు రూ.5 లక్షలతో అదే కాలనీలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే రూ.4 లక్షలతో కమ్యూనిటీ రచ్చబండ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులు, పేద ప్రజల అండదండలు ఉన్నంత వరకు ఈ రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని పక్కాగా అమలు చేశారని గుర్తుచేశారు.

చంద్రబాబు కుట్రలు

ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కుట్రలు కుతంత్రాలతో విమర్శలు చేయడంతో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కలిసి ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు సంక్షేమ పథకాలను ఆపకుండా అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని, అలాంటి మహోన్నత వ్యక్తిపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం దారుణమన్నారు. పడుగుపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మొట్టమొదటి ఎన్నికల ప్రచారాన్ని తమ గ్రామంలోని కాలనీలో ఏర్పాటు చేయడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రైల్వే బోర్డు మాజీ సభ్యుడు ఎస్‌కే షాజహాన్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహ్మద్ బాషా, రాధాకృష్ణ, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్రశేఖర్, రాష్ట్ర బొందలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, సచివాలయ మండల కన్వీనర్ ప్రసాద్, శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ఎస్సై చొరవ



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు: మనుబోలు – పొదలకూరు మార్గంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్పందించిన ఎస్సై అజయ్‌కుమార్ మంగళవారం సొంత నిధులతో గుంతల పూడ్చివేత పనులు చేపట్టారు. జేసీబీతో తారు సన్న కంకర మిశ్రమాన్ని గుంతల్లో వేసి పూడ్చివేయించారు. ఈ గుంతల కారణంగా రెండు రోజుల క్రితం బీజేపీ మండల అధ్యక్షుడు ఓడూరు శ్రీనివాసులురెడ్డి బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి మృతిచెందిన విషయం తెలిసిందే. గతంలో కూడా ఇక్కడ పలువురు వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి మృతిచెందడమో, గాయపడడమో జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఎస్సై అజయ్‌కుమార్ స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడంపై పలువుర ఆయనను అభినందిస్తున్నారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైన వారికి అభినందన



రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైన వారిని అభినందిస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్టాత్మకమైన రాష్ట్రస్థాయి ఎన్ఎస్ఎస్ అవార్డులకు వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి నలుగురు ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి వెలగపూడిలోని సచివాలయంలో మంగళవారం ప్రకటించారు. మొత్తం 16 మందికి అవార్డులు ప్రకటించగా, అందులో నలుగురు వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ఎంపికయ్యారు. ఉత్తమ సమన్వయకర్తగా డాక్టర్ ఉదయ్ శంకర్, ఉత్తమ ప్రోగ్రాం అధికారిగా కావలిలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ప్రోగ్రాం అధికారి పేరూరి వెంకట సాయితేజ, ఉత్తమ వలంటీర్‌గా గూడూరులోని ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని పల్లపు ప్రియ, వీఎస్‌యూ కళాశాలలో బయోటెక్నాలజీ విభాగంలో ఎమ్మెస్సీ చదువుతున్న పృధ్వీరాజు ఎంపికయ్యారు. వీరిని కాకుటూరులోని వీఎస్‌యూలో వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి మంగళవారం అభినందించారు. రాబోయే రోజుల్లో వీఎస్‌యూకు మరింత గుర్తింపు వచ్చేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగనన్న



వైఎస్సార్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న నాయకులు

ముత్తుకూరు: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర పూర్తి చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయ కేతనం ఎగురవేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఎంపీపీ అన్నారు. సర్పంచ్‌లు బూదూరు లక్ష్మి, కాకి మస్తానమ్మ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డివిజన్, సబ్ డివిజన్‌ల మార్పు



మాట్లాడుతున్న ఏఈ నాగార్జున

మనుబోలు: మనుబోలు ట్రాన్స్‌కో కార్యాలయాలకు సంబంధించి డివిజన్, సబ్ డివిజన్‌లను మార్పు చేసినట్లు మనుబోలు ట్రాన్స్‌కో ఏఈ నాగార్జున తెలిపారు. మంళవారం ఆయన మనుబోలులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా మనుబోలును గూడూరు సబ్ డివిజన్ నుంచి పొదలకూరు సబ్ డివిజన్‌కు మార్పు చేసినట్లు తెలిపారు. అలాగే గూడూరు డివిజన్ నుంచి నెల్లూరు డివిజన్‌కు మార్చామని తెలిపారు. ఈ మార్పుల కారణంగా వినియోగదారుల కనెక్షన్ సర్వీస్ యుయస్సీ నంబర్లలోని మొదటి ఐదు అంకెలు 31121 నుంచి 35215లకు మారుతాయని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే పొదలకూరు ఏడీ ఫోన్‌నంబర్ 9440812001కు కాల్ చేయవచ్చని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోండి



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ మొహసీనా సుల్తానా

మనుబోలు: ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు మొహసీనా సుల్తానా సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9 లేదా 10 తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షల్లో హైరిస్క్‌తో ఉన్న గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకునేందుకు గర్భిణులు సంకోచించాల్సిన అవసరం లేదన్నారు. మహిళలు గర్భం దాల్చింది మొదలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజయ్య, పీహెచ్ఎన్ జయశీల, సూపర్‌వైజర్లు వెంకటరమణయ్య, హైమావతి, ఫార్మాసిస్ట్ పద్మజ, సిబ్బంది రాజన్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పోలేరమ్మ జాతర



పోలేరమ్మకు పొంగళ్లు పొంగిస్తున్న గ్రామస్తులు

కొడవలూరు: స్థానిక ఎస్సీకాలనీలో వెలసిన పోలేరమ్మతల్లి జాతర మంగళవారం భక్తులు వేడుకగా నిర్వహించారు. గ్రామం పాడిపంటలు, సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఏడాది పోలేరమ్మకు జాతర నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పోలేరమ్మకు ఐదు వారాల పాటు చద్ది కార్యక్రమాలు, ఐదో మంగళవారం రోజున జాతర వేడుకగా నిర్వహిస్తారు. అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు కోవూరు వెంకీ, పి.రాధాకృష్ణ, కాకాని మురళి, అరగల సుధీర్, ముడి శ్రీకాంత్, దుంపల కిరణ్, నక్కా రాజేంద్ర, మన్యం హరికృష్ణ, గాలి ప్రసాద్, చింతాటి రవి, ఎ.సుబ్రహ్మణ్యం, డి.దినేష్, ఎం.అనిల్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సోషల్ మీడియా ఎంతో కీలకమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేలా కుట్ర చేస్తున్నాయన్నారు. ఆ కుట్రలను తిప్పికొట్టేలా అందరం కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ ప్రసాద్, అన్ని మండలాల సోషల్ మీడియా కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆడుదాం ఆంధ్రా' వాలీబాల్ పోటీలు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 'ఆడుదాం ఆంధ్రా' మండలస్థాయి బాలబాలికల వాలీబాల్ పోటీలు బుధవారం జరుగుతాయని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. ఎంపికైన బాలబాలికల జట్లు ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

పంట నమోదును వేగవంతం చేయండి

కొడవలూరు: పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోవూరు ఏడీఏ డి.సుజాత వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని వీఏఏలతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఏఏలు పంట నమోదు పూర్తి చేసి వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. యూరియా పంపిణీలో వీఏఏల కృషి ప్రశంసనీయమన్నారు. కోరిన రైతులకు సకాలంలో యూరియా అందించి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పనిచేయడాన్ని ఆమె అభినందించారు. ఏఎస్ఓ ఎం.రమా గాయత్రి మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలను సకాలంలో పూర్తి చేయాల్సి ఉన్నందున ఇప్పట్నుంచే సర్వే నంబర్ల నమోదు, విస్తీర్ణం లాంటి వివరాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, వీఏఏలు పాల్గొన్నారు.

వరిణి గ్రామంలో సంతకాల సేకరణ

విడవలూరు: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా విడవలూరు మండలంలోని అన్ని పంచాయతీల్లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వరిణి గ్రామంలో సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు భక్తవత్సలం, స్పెషల్ ఆఫీసర్ సోఫియా, అంబేడ్కర్ యువజన కమిటీ సభ్యులు నారాయణ, విజయ్, కామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి సంపూర్ణ మద్దతు

కొడవలూరు: 'జన్ భాగీదారి' కార్యక్రమంలో భాగంగా సామాజిక న్యాయానికి ప్రజల మద్దతు కోరుతూ మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఫ్లెక్సీపై సంతకాలు సేకరించారు. అధికారులతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేసి సామాజిక న్యాయానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.సునీల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని నక్కలోళ్ల సెంటర్ వద్ద చెన్నై వైపు వెళ్లే పట్టాలపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. ఎరుపు, తెలుపు, బ్లూ రంగు గళ్ల ఫుల్ హ్యాండ్స్ చొక్కా.. బ్లూ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నారు. కుడిచేతిపై అమ్మ, ఛాతిపై బంగారమ్మ, బంగారి, బన్ని అనే పచ్చబొట్లున్నాయి. నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లో మెరిసిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

కోవూరు : మండలంలోని గంగవరం గ్రామం వద్ద నున్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇటీవల ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో తమ కళాశాల ప్రతిష్టను ఇనుమడింపజేశారని కళాశాల కార్యదర్శి ఎన్.సుధాకర్‌రె తెలిపారు. మంగళవారం ఆ కళాశాల ఆవరణలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో ముందంజలో ఉండడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లలో విజేతలుగా, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లలో రన్నర్స్‌గా, 100 మీటర్లు పరుగుపందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచారని తెలిపారు. మూడో సంవత్సరం విద్యార్థి ఎస్.లోకేష్ ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మహేష్‌బాబు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్, సహాయ ఫిజికల్ డైరెక్టర్ వి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలులో వైఎస్సార్‌సీపీ సంబరాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మనుబోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్పయాత్ర పూర్తయి ఐదేళ్లు అయిన సందర్భంగా మనుబోలులో వైఎస్సార్‌సీపీ నేతలు దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో భాగంగా రాష్ట్రంలో పర్యటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని అధికారంలోకి రాగానే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. నవరత్నాల పథకాలకు రూపకల్పన చేసి పక్కాగా అమలు చేశారని తెలిపారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి హామీని నెరవేర్చి ప్రజలు హృదయాల్లో నిలిచిపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గిద్దంటి రమణయ్య, ఏలూరు భాస్కర్‌రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్, తుపాలకు గిరి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

నెల్లూరు(క్రైమ్): గంగమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగుడు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పదారుపల్లిలో గ్రామదేవత గంగమ్మ ఆలయం ఉంది. సోమవారం రాత్రి పూజల అనంతరం అర్చకుడు ఆలయానికి తాళాలేసి ఇంటికెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగుడు ఆలయంలోకి వెళ్లి గర్భగుడి గేట్ తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. ఈ క్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు శ్రీహరి సోదరుడి కుమారుడు వినయ్ ఆలయ ఆవరణలో పార్క్ చేసి ఉన్న కారును తీసుకెళ్లేందుకు వెళ్లారు. విషయాన్ని గమనించిన దుండగుడు అప్రమత్తమై అమ్మవారి మెడలోని బంగారు మంగళసూత్రాన్ని లాక్కున్నాడు. వినయ్ పట్టుకునేలోపే దుండగుడు పరారయ్యాడు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు శ్రీహరి ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ నారాయణ దేవస్థానానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. సీసీ కెమెరా పుటేజీని పరిశీలించారు. ధర్మకర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రసాద్

నెల్లూరు (దర్గామిట్ట): నెల్లూరు రూరల్ నియోజకవర్గ సీటును జనసేనకు కేటాయించనున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆందోళనతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ప్రసాద్ విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తొమ్మిదేళ్లలో కోటంరెడ్డి చేసిన అభివృద్ధి.. పది నెలల్లో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఎంతో తెలుసుకోవాలని సూచించారు. కోటంరెడ్డి కారణంగా నియోజకవర్గంలోని వ్యాపారులు, రియల్టర్లు, రైస్‌మిల్లర్లు భయభ్రాంతులతో జీవించారని చెప్పారు. నియోజకవర్గ రాజకీయాల్లో విష సంస్కృతిని ఆదాల పెకిలించేశారని చెప్పారు. కోటంరెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి కోట్లు దండుకొని, ఎమ్మెల్యే నిర్వచనానికే మచ్చతెచ్చేలా ప్రొటోకాల్‌కు భంగం కలిగించారని ఆరోపించారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. తమ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై మాట్లాడే అర్హత కోటంరెడ్డికి లేదని చెప్పారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సుధాకర్ యాదవ్, ముడియాల రామిరెడ్డి, పాశం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.